క్లుప్తంగా

కాంగ్రెస్ ద్వారానే పేదల సంక్షేమం



ప్రచారం చేస్తున్న అడే గజేందర్

ఇచ్చోడ: కాంగ్రెస్ ద్వారానే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని కాంగ్రెస్ నాయకుడు అడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోకస్‌మాన్నూర్‌లో పర్యటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు చేసిందేమిలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 500లకే సిలిండర్ అందజేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, ఇచ్చోడ మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి భీమన్న పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



వారోత్సవాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆదిలాబాద్‌టౌన్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ రాధ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ బొట్టుపెట్టి గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. ఏఎన్ఎం తులసి, ఆశ కార్యకర్తలు రజన, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని సుంకిడి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త శోభ మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు తాగించాలన్నారు. ముర్రుపాలలో రోగ నిరోధకశక్తి అధికంగా ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చదువుకు చేయూత

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన తేలు విశ్వతేజ తల్లిదండ్రులను కోల్పోయి దీనస్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ శుక్రవారం గ్రామానికి వెళ్లి విశ్వతేజను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అతని చదువుల కోసం తోడ్పాటునందిస్తానని తెలిపారు. ఆయన వెంట రాములు, రాఘవులు, లింగన్న ఉన్నారు.

సీసీ కెమెరాల మరమ్మతులకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న యజమానులు

నేరడిగొండ: మండల కేంద్రంలో గల సీసీ కెమెరాల మరమ్మతుల కోసం మెడికల్ షాపుల యజమానులు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం నేరడిగొండ ఎస్సై సాయన్నకు పోలీస్‌స్టేషన్‌లో రూ.8,500 నగదు అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ.. సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంటుందని, అపరిచిత వ్యక్తులతో పాటు చోరీలు జరిగినప్పుడు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకునేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

ఓర్వలేకే కక్షసాధింపు

ఖానాపూర్: భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్‌గాంధీకి వచ్చిన ప్రజాదరణను ఓర్వలేకనే కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతుందని ఏఐసీసీ రీసెర్చ్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో రాజన్న, శ్రీను, షారుఖాన్, సలీం మహ్మద్ తదితరులున్నారు.

విరాళం అందజేత

ఖానాపూర్: బాసర సరస్వతి అమ్మవారి సన్నిధిలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన సత్రానికి ఖానాపూర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రూ.51 వేలను వి రా ళంగా అందజేశారు. శుక్రవారం పట్టణంలోని శ్రీరా ంనగర్ కాలనీలోని సంఘ భవనంలో విరాళం అందజేశారు. సమావేశంలో సంఘం అధ్యక్షులు పాదం రాజన్న, ప్రధాన కార్యదర్శి గాడ్పు రాజేశ్వర్, గౌరవ అధ్యక్షుడు తోట సత్యం, సంతోష్, లక్ష్మ ణ్, గంగనర్సయ్య, నాగేశ్ తదితరులున్నారు.

పింఛన్ కోసం ఎదురుచూపు

- పెండింగ్‌లో వితంతు పింఛన్లు
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు గోగుల లక్ష్మి. భర్త ఏళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈమెకు పింఛన్ రావడం లేదు. లక్ష్మి రోజువారీ కూలీ పని చేస్తేనే పూట గడుస్తది. పింఛన్ వస్తే ఆసరాగా ఉంటుందని, ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కోరుతోంది.



సిరికొండ: పింఛన్ల కోసం లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. నూతన వితంతు పింఛన్లు మంజూరు కాక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దివ్యాంగులకు నెలకు రూ. 4116 పింఛన్ అందజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ వితంతు పింఛన్లు మంజూరు చేయడంలో జాప్యం చేస్తోంది. అనేక మంది వితంతువులు పింఛన్ అమలు కాక ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు.

వితంతువులను మరిచిన ప్రభుత్వం..

కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి జీవనాధారం లేక, రోజు కూలీకి వెళ్తూ తమ పిల్లలను సాదుతున్న కుటుంబాలు మండలంలో ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ ఆసరా అవుతుందెమోనని అనుకుంటే సుమారుగా పది ఏళ్లు దాటినా.. కూడా నూతనంగా వితంతు పింఛన్ మాత్రం అమలు చేయడం లేదు. పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్న వారు అధికంగా ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు, ఎంపీడీవో వద్దకు వెళ్లి తమ పింఛన్ కోసం వాకబు చేయడం లబ్ధిదారులకు ఒక పనిగా మారింది. తమ చేతుల్లో ఏమీ లేని, ప్రభుత్వం మంజూరు చేస్తేనే పింఛన్ వస్తుందని చెప్పడంతో వెనుదిరుగుతున్నారు. ఇలా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో వితంతు పింఛన్ కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వితంతు పింఛన్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

రాష్ట్ర ప్రభుత్వం వింతువులను పట్టించుకోవడం లేదు. వితంతు పింఛన్ అమలు చేయకపోవడంతో లబ్ధిదారులు ప్రతీ రోజు పంచాయతీ కార్యాలయానికి వచ్చి అడుగుతున్నారు. గ్రామంలో అనేక మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వం స్పందించి వితంతు పింఛన్ అమలు చేయాలి.

– పెందుర్ అనిల్ కుమార్, రిమ్మ, సర్పంచ్

పింఛన్ ఇవ్వండి సారూ..



నా భర్త కినక మారుతి 2019లో అనారోగ్యంతో మృతి చెందాడు. నాకు ఎలాంటి జీవనాధారం లేదు. కేవలం కూలీ పని చేస్తూ.. జీవిస్తున్నాను. ఆరుగురి పిల్లలను వచ్చిన కూలితోనే సాదుతున్నాను. ఇప్పటికైఏనా నాకు పింఛన్ ఇప్పించండి.

– కినక కృష్ణబాయి, రిమ్మ

దరఖాస్తులు పెండింగ్‌లో లేవు



మండల పరిషత్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులు లేవు. గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేశాం. ఇప్పుడు ఆన్‌లైన్ కావడం లేదు. ప్రభుత్వం నూతన పింఛన్లు మంజూరు చేస్తే పంపిణీ చేస్తాం.

– ఎస్.సురేశ్, ఎంపీడీవో, సిరికొండ

‘రైతులకు పరిహారం అందించాలి’



పంటలను పరిశీలిస్తున్న నరేశ్ జాదవ్

తాంసి: వరదల వలన నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే ఎకరానికి రూ.15 వేలు పరిహారం అందించాలని ఏఐసీసీ సభ్యులు నరేశ్ జాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి), గోముత్రి గ్రామాల్లో పర్యటించి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పత్తి, సోయా, కంది పంటల నష్ట వివరాలను అడిగి తెలుసుకొన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యమని చెబుతున్నా.. ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంరం కోటేష్, వసంత్, అశోక్, సుదర్శన్, కాశీం, గంగన్న, మలయ్య, నరేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ సభ్యులు నరేశ్‌జాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కోటేష్, కరుణాకర్, ఆసిఫ్, నాగనాథ్, గంగరాం పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కైలాస్‌నగర్: పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి అల్లూరి రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జైనథ్, బేల మండలాలు, ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు కూలి నిరాశ్రయులైన వారికి వెంటనే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. రోడ్లు, కల్వర్టులు కోతలకు గురై ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ రఫీక్, రాజేశ్వరరావు, ప్రభాకర్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ ఆర్డీవోగా జీవాకర్‌రెడ్డి



జీవాకర్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఆర్డీవోగా భూపాలపల్లి జిల్లా నుంచి పదోన్నతిపై వచ్చిన ఎల్. జీవాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన కదం సురేశ్‌ను ప్రభుత్వం కుమురం భీం ఆర్డీవోగా బదిలీ చేసింది.

కాంగ్రెస్‌లో చేరికలు

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ఆడే గజేందర్ ఆధ్వర్యంలో మన్నూర్ భట్టీ కాలనీకి చెందిన పలువురు గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ కుటుంబపాలనతో విసిగిపోయి కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని నాయకులు అన్నారు. ఇచ్చోడ మండల అధ్యక్షుడు నారాయణ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్, బేర దేవన్న, వసీంఖాన్, శేఖర్, ముస్తఫా, షఫీ, భీమన్న పాల్గొన్నారు.

ఉద్యమానికి పెరుగుతున్న మద్దతు



మద్దతు తెలుపుతున్న ముస్లిం మత పెద్దలు

బోథ్: బోథ్ డివిజన్ ఉద్యమానికి మద్దతు పెరుగుతోంది. డివిజన్ కోసం మండల కేంద్రంలో చేస్తున్న దీక్షలు శుక్రవారానికి 19వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో బోథ్ ప్రభుత్వ పాఠశాల 1995వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు కూర్చున్నారు. వీరికి ముస్లిం మతపెద్దలు సంఘీభావం ప్రకటించారు. అనంతరం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్ మద్దతు తెలిపారు. ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు ఇప్పటికే గ్రామాల్లో పర్యటించారు. డివిజన్ చేస్తే కలిగి లాభాలను ప్రజలకు వివరించారు.

బోథ్‌ను డివిజన్ చేయండి

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని శుక్రవారం మంత్రి కేటీఆర్‌ను అసెంబ్లీ లాబీలో బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ కలిసి విన్నవించారు. డివిజన్‌గా మారిస్తే దూరభారం తగ్గడంతో పాటు పాలన సులభమవుతుందన్నారు. ప్రజలు డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారని వివరించారు. అనంతరం మాజీ ఎంపీ నగేశ్‌తో కలిసి ఆర్థికశాఖ మంత్రి హరీష్ రావును కలిశారు. బోథ్ తహసీల్దార్ భవనానికి రూ. 2 కోట్లు కేటాయించాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సాయన్న, శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

బోథ్: కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ బోథ్ మండలంలోని సోనాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. దాదాపు 20 సంవత్సరాల నుండి చాలీచాలని జీతాలతో విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎంహెచ్ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

బోథ్: మండలంలోని కోట(కె) గ్రామంలో వసుధ ఫౌండేషన్ అందించిన పుస్తకాలను సర్పంచ్ పూజ శుక్రవారం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. ఉపాధ్యాయులు రాంచందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’కు తరలిరండి



కడెం పాఠశాలలో ఉపాధ్యాయిల మానవహారం

కడెం: సీపీఎస్ రద్దు చేసి, పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 12న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులు తరలిరావాలని టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణకు హాజరై మాట్లాడారు. రవీందర్, సుదర్శన్, వినోద్‌కుమార్, దామోదర్ తదితరులున్నారు.

ఖానాపూర్: పాత పెన్షన్ విధానం పునరద్ధరించాలనే డిమాండ్‌తో ఈనెల12న చతలపెట్టిన చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షులు కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ సమావేశంలో మాట్లాడారు. ఎంఈవో మధుసూదన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రాజన్న ఉన్నారు.

కుంటాల: గణితంలో చతుర్విధ ప్రక్రియ సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి గజపెల్లి నర్సయ్య సూచించారు. శుక్రవారం కుంటాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధనలో భాగంగా గణిత బోధకులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ జగదీశ్వర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



నేరడిగొండ: మండలంలోని రాజులతండా శివారులో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. భారీ వర్షం కురిస్తే గద్దె కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి వాటికి మరమ్మతులు చేపట్టాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా పాయల్ శంకర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ జన్మదిన వేడుకలను శుక్రవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం పాయల్ శంకర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్ రెడ్డి, దినేష్ మటోలియ, కృష్ణయాదవ్, రఘుపతి, వేణుగోపాల్, జ్యోతి, ఆకుల ప్రవీణ్, ఆర్యన్ రాజేశ్, మహేందర్, జోగు రవి పాల్గొన్నారు.

షీటీం సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

సిరికొండ: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థినులకు షీ టీం సభ్యులు కమళ, భాగ్యశ్రీ అవగాహన కల్పించారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో మాట్లాడవద్దన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. షీటీం సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఆయుర్వేద వైద్యులు

నేరడిగొండ: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయుర్వేద వైద్యుడు జె.గంగాధర్ అన్నారు. మండలంలోని వాంకిడిలో ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో తరచూ వచ్చే వ్యాధుల గురించి అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే యోగా విశిష్టత వివరించారు. అనంతరం ఆయుష్ అనే ఆయుర్వేద పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యామ్‌రావు, ఫార్మసిస్ట్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలంగాణ సంస్కృతిక, సారధి కళాకారులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఈశ్వర్‌నగర్‌లో సీజనల్ వ్యాధులు, ఓటుహక్కు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, కళాకారులు గోవింద్‌రావ్, రమేశ్, వెంకట్‌రావ్, శంకర్ రాథోడ్, మురళి, ఆశిష్, నర్సయ్య, నగేశ్, దుర్పతబాయి, రాజలింగు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: బజార్‌హత్నూర్ మండలంలోని దేహగామ గ్రామంలో జై భీమ్‌నగర్ కాలనీ బోర్డును ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు జై భీమ్‌నగర్ కాలనీ బోర్డును కావాలనే తొలగించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వాగ్మారే కాంరాజ్, పరత్ వాగ్ దత్త, శివాజీ, కాంబ్లే సునీల్, దీలిప్ మెరే, రాజువర్ధాన్, సత్యానంద్, రాజేందర్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో నూతన కాలనీ ఎదుట పెట్టిన జై భీం బోర్డును కూల్చిన వారిని కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు కోరారు. శుక్రవారం ఎస్సై నరేశ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు బత్తుల రమేశ్, అమృత రావు పాటిల్, భగత్ ప్రవీణ్, ఏరేకర్ రాహుల్, గడప ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు



తుకారాం



విజయనందం



రాజలింగం



శ్రీనివాస్



సుభాష్‌చంద్ర

ఇచ్చోడ తహసీల్దార్‌గా తుకారాం

ఇచ్చోడ: మండల తహసీల్దార్‌గా తుకారాం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముథోల్ తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన ఇచ్చోడ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి వంతు కృషి చేస్తానని తెలిపారు.

గాదిగూడ తహసీల్దార్‌గా విజయనందం, నార్నూర్ తహసీల్దార్‌గా రాజలింగం

నార్నూర్: గాదిగూడ తహసీల్దార్‌గా విజయనందం, నార్నూర్ తహసీల్దార్‌గా రాజలింగం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ గిరిజనులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


ఆదిలాబాద్ అర్బన్ మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండల తహసీల్దార్‌గా సంపతి శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నిజామాబాద్ నుంచి జిల్లాకు వచ్చారు. ఉద్యోగులు, సి బ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సిరికొండ తహసీల్దార్‌గా సుభాష్‌చంద్ర

సిరికొండ: మండల తహసీల్దార్‌గా సుభాష్‌చంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ అర్బన్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సుభాష్ చంద్ర బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ఎస్తేర్ వర్ణ ఆర్డీవో కార్యాలయానికి ఏవోగా బదిలీపై వెళ్లింది.

నేరడిగొండ తహసీల్దార్‌గా సంతోష్‌రెడ్డి



సంతోష్‌రెడ్డి

నేరడిగొండ: నేరడిగొండ తహసీల్దార్‌గా సంతోష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ పవన్‌చంద్ర నిర్మల్ జిల్లా బాసర మండలానికి బదిలీపై వెళ్లారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం నుంచి ఇక్కడికి బదిలీపై సంతోష్‌రెడ్డి రావడంతో ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు.

కాలనీవాసులు అప్రమత్తంగా ఉండండి

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లు అటవీ ప్రాంతం సమీపంలో ఉన్నందున కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ సీఐ డి.మోహన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాలనీవాసులకు పోలీసు, మున్సిపల్, అటవీ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇళ్ల ప్రాంతంలో ఎవరూ ఆక్రమణలు చేయవద్దని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎస్సై ఆర్.శంకర్, ఎఫ్ఆర్వో వినాయక్, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ పాల్గొన్నారు.